సాక్షి
బాపట్ల
ఆదివారం ׀ 18 ׀ మే ׀ 2025



శంకరమ్మ తల్లి తిరునాళ్ల

చెరుకుపల్లి: మండల పరిధిలోని బలుసుల పాలెం గ్రామంలో వేంచేసియున్న శంకరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు.



మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు

పొన్నూరు: పొన్నూరులోని గాంధీ బొమ్మ సెంటర్, గుంటూరు బస్టాఫ్‌ల్లో మజ్జిగ పంపిణీ కేంద్రాలను శనివారం ఏర్పాటుచేశారు. జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు ప్రారంభించారు.

ఆక్రమణల తొలగింపు



వినుకొండ: వినుకొండలోని శివయ్య స్థూపం సెంటరులో ఆక్రమణలను ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ఆక్రమణల తొలగింపు చేపట్టారు.

అక్రమాలకు పోలీసు దన్ను

- యథేచ్ఛగా అనధికార ఎక్స్‌ప్లోజర్స్ విక్రయం
- జోరుగా లైసెన్స్ హోల్డర్ల అక్రమ వ్యాపారాలు
- కాపు కాస్తున్న పోలీసులకు నెల మామూళ్లు
- అక్రమ దందాకు అండగా ఉన్నామంటూ అధిక మొత్తానికి డిమాండ్
- చీమకుర్తి లైసెన్స్ వచ్చనేత ద్వారా పోలీసులకు మామూళ్లు



క్వారీల్లో ఉపయోగించే పేలుడు పదార్థాలను పరిశీలిస్తున్న సిబ్బంది(ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: గ్రానైట్ క్వారీల్లో పేలుడు పదార్థాల అక్రమ విక్రయాలకు జిల్లాలోని కొందరు పోలీసులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రకాశం జిల్లా చీమకుర్తి కేంద్రంగా పేలుడు సామగ్రి లైసెన్స్‌దారు హైదరాబాద్, నాగపూర్, చెన్నై ప్రాంతాల నుంచి అక్రమంగా ఎక్స్‌ప్లోజర్స్‌ను పెద్దఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని ప్రకాశం జిల్లా చీమకుర్తి, బాపట్ల జిల్లా బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు, గురిజేపల్లి ప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ క్వారీల యజమానులకు బిల్లులు లేకుండా విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమాలకు దన్నుగా ఉన్నందుకు పేలుడు పదార్థాల వ్యాపారులు కొందరు పోలీసు అధికారులకు నెల మామూళ్ల ముట్టజెప్పి తమ వ్యాపారాన్ని గుట్టు చప్పుడు కాకుండా సాగిస్తున్నారు. ఒక డీఎస్పీకి నెలకు రూ.15 వేలు చొప్పున కప్పం కడుతున్న వ్యాపారులు క్వారీల పరిధిలోని కొందరు సీఐలకు నెలకు రూ.15 వేల వంతున ముట్టజెపుతున్నట్లు సమాచారం. ఎస్ఐలకు సైతం రూ.15 వేలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల క్వారీల పరిధిలో కొత్తగా బదిలీపై వచ్చిన కొందరు ఎస్ఐలు స్థానికంగా పనిచేస్తూ అక్రమ వ్యాపారానికి దన్నుగా నిలుస్తున్నందున తమకు నెలకు రూ.20 వేలు ఇవ్వాలని లైసెన్సుదారులను డిమాండ్ చేసినట్లు సమాచారం. అంతటితో వదలక పేలుడు పదార్థాల లైసెన్సుదారులతో సమావేశం పెట్టి గట్టిగా చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో స్థానిక పోలీసుల సహకారం లేకుండా అక్రమ వ్యాపారం సాగించడం కష్టమని భావించిన పేలుడు పదార్థాల వ్యాపారుల సిండికేట్ దిగువ స్థాయి పోలీసు అధికారులకు నెల మామూళ్లు పెంచి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

అడిగినంత ఇచ్చేద్దాం

రికార్డులపై సంతకాలు పెట్టే అధికారులకు ఇచ్చే మొత్తం కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న పోలీసు అధికారులకు వారు అడిగిన మొత్తం ఇవ్వాలని పేలుడు పదార్థాలను వితౌట్‌లో సరఫరా చేస్తున్న చీమకుర్తి లైసెన్సుదారుడు త్రినాథరావు పేలుడు సామగ్రి లైసెన్సుదారుల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. పోలీసు అధికారులు అడిగినంత మొత్తం అందరూ ఇవ్వాలని సదరు వ్యాపారి మిగిలిన లైసెన్సు దారులకు హుకుం జారీ చేశారు. జిల్లాతోపాటు ప్రకాశం, నెల్లూరు, పల్నాడు జిల్లాల పరిధిలో ఉన్న పేలుడు పదార్థాల లైసెన్సు దారులకందరికీ చీమకుర్తి లైసెన్సుదారుడే వితౌట్‌లో పేలుడు సామగ్రి సరఫరా చేస్తుండడం, పేలుడు సామగ్రి క్రయవిక్రయాల రికార్డులు సైతం ఆయనే నిర్వహిస్తుండడంతో మిగిలిన వ్యాపారులు పోలీసులకు నెల మామూళ్లు పెంచి ఇచ్చేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

పేలుడు పదార్థాల అక్రమ విక్రయాల వల్ల అటు ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన రాబడికి గండిపడుతుంది. కానీ కొందరు పోలీసులు నెల మామూళ్లకు కక్కుర్తిపడి అక్రమ వ్యాపారాలకు దన్నుగా నిలవడం మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇప్పటికైనా పేలుడు పదార్థాల అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలి.

రికార్డులు పరిశీలించకుండానే సంతకాలు

వాస్తవానికి పేలుడు పదార్థాల వ్యాపారులు పేలుడు పదార్థాల కొనుగోళ్లు, విక్రయాలకు సంబంధించి ఫారం-3, ఫారం-4 రికార్డులను క్రమం తప్పకుండా నిర్వహించాల్సి వుంది. డీఎస్పీ స్థాయి అధికారి ప్రతి మూడు నెలలకొకసారి వీటిని పరిశీలించి సంతకాలు చేయాల్సి ఉంటుంది.

అయితే క్రమం తప్పకుండా నెల మామూళ్లు పుచ్చుకుంటున్న కొందరు పోలీసు అధికారులు పేలుడు పదార్థాల వ్యాపారులు రాసుకు వచ్చిన రికార్డులపై సంతకాలు చేయడం పరిపాటిగా మారింది.

రేపటి నుంచి ఏపీ ఈఏపీ సెట్-2025

- 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 41,319 మంది విద్యార్థులు
- మూడు జిల్లాల్లో 22 పరీక్ష కేంద్రాలు
- నిముషం ఆలస్యమైనా నో... ఎంట్రీ



ఆన్‌లైన్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

గుంటూరుఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ) ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనుండగా, ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కాకినాడలోని జేఎన్‌టీయూ భాగస్వామ్యంతో ఏపీ ఈఏపీసెట్-2025ను నిర్వహిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు 41,319 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఇంజినీరింగ్ పరీక్షలకు 34,148, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 7,106, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు 65 మంది ఉన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాలను కలుపుకుని మొత్తం 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షల జరగనున్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 41,319 మంది విద్యార్థులు

ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 41,319 మంది హాజరు కానున్నారు.

- గుంటూరు జిల్లాలో 15 కేంద్రాల పరిధిలో మొత్తం 25,692 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంజినీరింగ్ 21,551, అగ్రికల్చర్, ఫార్మసీ 4,100, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు 41 మంది ఉన్నారు.
- పల్నాడు జిల్లాలోని ఐదు కేంద్రాల పరిధిలో మొత్తం 11,126 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంజినీరింగ్ 9,198, అగ్రికల్చర్, ఫార్మసీ 1,912, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు 16 మంది ఉన్నారు.

-బాపట్ల, చీరాలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల పరిధిలో మొత్తం 4,501 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంజినీరింగ్ 3,399, అగ్రికల్చర్, ఫార్మసీ 1,094, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు ఎనిమిది మంది ఉన్నారు.

విద్యార్థులు వీటిని వెంట తీసుకెళ్లాలి

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన ఏపీ ఈఏపీ సెట్-2025 దరఖాస్తు ప్రింటవుట్ కాపీలో పొందుపర్చిన నిర్ణీత బాక్స్‌లో విద్యార్థి కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.

నిముషం ఆలస్యమైనా నో.. ఎంట్రీ

ఏపీ ఈఏపీ సెట్‌కు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7.30 నుంచి 9.00 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2.00 గంటల వరకు అనుమతిస్తారు. ఉదయం 9.00 గంటలు, మధ్యాహ్నం 2.00 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష జరిగే రోజున కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల దగ్గర తనిఖీలతోపాటు బయోమెట్రిక్ హాజరు నమోదు, సంతకం చేయాల్సి ఉన్నందున చివరి నిముషంలో హడావుడి పడకుండా చూసుకోవాలి.

న్యూస్‌రీల్

జెడ్పీలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, పరిపాలనాధికారులు, ఉద్యోగులు కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. సీఈవో జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బీట్ ది హీట్ నినాదంతో పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు చెప్పారు. వేసవిలో ఎండల తీవ్రత, వడగాలలు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

వివాదాస్పదంగా మారిన ఫ్లెక్సీ



తెనాలిఅర్బన్: స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి మున్సిపల్ మార్కెట్‌లో శనివారం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసి ఫ్లెక్సీ వివాదాస్పదంగా మారింది. ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో ఏర్పాటు చేయకపోవడంతో పలువురు జనసేన పార్టీ నాయకులు కమిషనర్ బండి శేషన్నను ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే సహించేది లేదంటూ ఆయనను హెచ్చరించారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్

- గుంటూరు, పల్నాడు జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. గత జనవరి, ఏప్రిల్ నెలల్లో రెండు సెషన్లలో జరిగిన మెయిన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఆదివారం జరగనున్న అడ్వాన్స్‌డ్‌కు హాజరు కానున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్ష కేంద్రాల పరిధిలో ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ)లు జరగనున్నాయి. పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ అడ్మిట్ కార్డులో పొందుపర్చిన నియమ, నిబంధనలు విధిగా పాటించాల్సి ఉంది.

జులై 5న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జులై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్, రెవెన్యూ, మోటర్ వాహన ప్రమాదాలు, చెల్లని చెక్కు, మనోవర్తి, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని కోరారు. సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నట్లైతే ఫీజు వాపస్ చేస్తారని తెలిపారు.


పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు డివిజన్ పరిధిలో గ్రూప్-డీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ-గుంటూరు (57201), గుంటూరు-మాచర్ల(57203), మాచర్ల-నడికుడి(57206), నడికుడి-మాచర్ల(57205), మాచర్ల-గుంటూరు(57204), గుంటూరు-విజయవాడ(57202) రైళ్లు ఈనెల 17, 18 తేదీల్లో రద్దు చేసినట్లు వెల్లడించారు. కాచిగూడ-నడికుడి(67779), నడికుడి-కాచిగూడ(67780) రైలు ఈనెల 18, 19 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు. రైలు ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

ఆధునిక జీవన శైలే ఐబీడీకి మూలం

- రోజురోజుకు పెరుగుతున్న బాధితులు
- ఐబీడీ వ్యాధిపై అవగాహన అవసరం అంటున్న వైద్యులు
- ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స అందిస్తే కట్టడి చేయవచ్చు
- రేపు వరల్డ్ ఐబీడీ డే



గుంటూరు మెడికల్ : పల్నాడుకు చెందిన నాగేశ్వరరావు కొంతకాలంగా తీవ్ర కడుపు మంటతో బాధపడుతున్నాడు. ఉద్యోగ రీత్యా రాత్రి సమయాల్లో ఎక్కువ సేపు మేలుకొని ఉండటం, సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడంతో ఈ మధ్యకాలంలో సమస్య తీవ్రమైన గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించారు. వైద్యులు పరీక్ష చేసి సుబ్బారావు ఇన్‌ఫ్లామేటరీ బోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

బాపట్లకు చెందిన శ్రీనివాస్ డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల కాలంలో తీవ్రమైన కడుపు మంట సమస్య ఉత్పన్నమవడంతో తల్లిదండ్రులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించారు. విద్యార్థి ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం, సకాలంలో ఆహారం తీసుకోకుండా చదువు ధ్యాసలో పడి ఒత్తిడికి గురవడం ద్వారా ఐబీడీ వ్యాధి బారిన పడ్డట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. ఇన్‌ఫ్లామేటరీ బోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్న వారి సమస్య రోజురోజుకు ఎక్కువతోందని, సకాలంలో చికిత్స తీసుకోని పక్షంలో దీర్ఘకాలం వ్యాధి వేధిస్తుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు తెలియజేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పదివేల మిలియన్ల కంటే ఎక్కువ మంది వ్యాధి బాధితులు ఉన్నట్లు ది యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ క్రోన్స్ అండ్ అల్సరేటీవ్ కొలిటీస్ అసోసియేషన్ పేర్కొంది. ఈ వ్యాధిని నియంత్రణలో పెట్టడం తప్ప పూర్తిగా నయం చేయలేరు. ఐబీడీ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 2010 నుంచి మే 19న ప్రపంచ వ్యాప్తంగా ఐబీడీ డే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

క్రాన్స్ వ్యాధి, అల్సరేటీవ్ కొలిటీస్ వ్యాధులనే ఐబీడీ వ్యాధిగా పిలుస్తారు. వాంతులు, విరేచనాలు, కొన్నిసార్లు రక్తపు విరేచనాలు, కడుపులో నొప్పి, అకస్మాత్తుగా శరీరం బరువును కోల్పోవడం, కడుపులో మంట, కడుపులో తిమ్మిరి, అత్యవసరంగా మలవిసర్జనకు వెళ్లాలనిపించడం, జ్వరం ఈ వ్యాధి లక్షణాలు. వ్యక్తుల ను బట్టి లక్షణాలు మారుతూ ఉంటాయి.

కారణాలు

ఐబీడీ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, జన్యుపరమైన కారణాలు, జీవన విధానం, కొన్ని రకాల మందులు మింగడం ద్వారా, ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం ద్వారా, ధూమపానం, మద్యపానం, ఒత్తిడి వ్యాధి కారణాలు.

నిర్ధారణ

ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఎమ్మారై, రక్త పరీక్షలు, సిటీస్కాన్, మలహర్ష ద్వారా ఐబీడీ వ్యాధిని నిర్ధారిస్తారు.

బాధితులు 40 ఏళ్లలోపు వారే

15 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఈవ్యాధి బారిన పడుతున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి బాధితులే. కొంత మంది 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సులో వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. గుంటూరు జిల్లాలో పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడు వారంలో నలుగురు లేదా, ఐదుగురు ఐబీడీ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ ఐదుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. గతంలో విదేశాల్లో మాత్రమే ఎక్కువగా ఉన్న ఈ వ్యాధి భారతదేశంలో కూడా నేడు పెరిగిపోతుంది. ప్రతి ఏడాది వ్యాధి బాధితుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతిరోజూ ఒత్తిడిని దూరం చేసుకునేందుకు వ్యాయామం, ధ్యానం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. ధూమపానం, మద్యపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. సమీకృత ఆహారాన్ని సక్రమంగా నమిలి మింగాలి. సరైన వేళల్లో ఆహారాన్ని తీసుకోవాలి. తిన్న వెంటనే నిద్రించకూడదు. రాత్రివేళల్లో త్వరితగతిన ఆహారం తినాలి. పాల ఉత్పత్తులు పరిమితి మోతాదులో తీసుకోవాలి. కాఫీ, టీలు, శీతలపానీయాలకు దూరంగా ఉండాలి.

–డాక్టర్ షేక్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు

వేమూరులో తిరంగా ర్యాలీ



ర్యాలీలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జిల్లా కలెక్టర్ వెంకట మురళి తదితరులు

వేమూరు: ఉగ్రవాదులను అంతం చేసేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయం వల్ల పాకిస్తాన్ భయపడి పోయిందని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణం శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వేమూరులో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంలో మొక్కలు నాటారు. మానవహారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్ర చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటమురళి, గ్రామ సర్పంచ్ సజ్జా లక్ష్మీ తిరుపతమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జొన్నలగడ్డ విజయబాబు, ఉసా రాజేష్, బండారు సూర్యనారాయణ, తహసీల్దారు సుశీల, ఎంపీడీవో శ్రీమన్నారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో అక్రమ అరెస్టులు అన్యాయం



మేరుగ నాగార్జున

బాపట్ల: రాజకీయ కక్షతోనే కూటమి ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేసిందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బాపట్లలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కక్ష రాజకీయాల వల్ల రాష్ట్రంలో వ్యవస్థలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. మద్యం కేసు అంటూ ఎటువంటి ఆధారాలు లేకపోయినా తప్పుడు వాంగ్మూలాలు సృష్టించి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీపై కక్ష సాధింపులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి ప్రైవేట్ సైన్యంలా వాడుకుంటూ రాజ్యాంగాన్ని అపహాస్యం పాలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన అధికారులను వేధించాలనే లక్ష్యంతో అక్రమంగా మద్యం కేసును బనాయించిందన్నారు. న్యాయస్థానాల ఆదేశాలను ధిక్కరిస్తూ పార్టీ నాయకులు, అధికారులను వేధింపులకు గురిచేస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే లిక్కర్ స్కాం జరిగిందన్నారు. వారి తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం దుర్మార్గానికి పాల్పడుతుందన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

మంత్రి నాదెండ్ల మనోహర్



రోడ్లు ఊడుస్తున్న మంత్రి మనోహర్, సబ్ కలెక్టర్ సంజనా సింహా

తెనాలి అర్బన్: 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంటే బ్యానర్లు పెట్టుకుని రోడ్లపై తిరగడం కాదని, ఉద్యోగులంతా ప్రజలకు మెరుగైన సేవలందించడమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని శనివారం ఉదయం శివాజీ చౌక్ నుంచి మార్కెట్ వరకు నిర్వహించారు. పలువురు సచివాలయ ఉద్యోగులు తమకు నూతన పింఛన్లు, రేషన్‌కార్డులపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఆయన ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ ఎందుకు రావడం లేదంటూ ప్రశ్నించారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. తప్పనిసరిగా వారానికి ఒకసారి ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పలువురు కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, వారందరిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సబ్ కలెక్టర్ సంజనా సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు తిరుమలకు తరలనున్న కూరగాయలు

మార్టూరు: తిరుమల–తిరుపతి దేవస్థానంలో ఉచిత అన్న ప్రసాద వితరణ కోసం మండల కేంద్రం మార్టూరు నుంచి ఆదివారం నాలుగో విడత కూరగాయల వాహనం తిరుమల బయలుదేరనుంది. 80 వేల మంది భక్తుల అన్నప్రసాదానికి సరిపడా కూరగాయలతో కూడిన వాహనం ఉదయం 8:30 గంటలకు స్థానిక బొడ్డు రాయి సెంటర్ నుంచి ప్రత్యేక పూజల అనంతరం శ్రీవారి వాహనం ప్రదర్శనగా బయలుదేరి స్టేట్ బ్యాంక్ సెంటర్ వరకు చేరనుంది. అక్కడి నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లనుంది. మార్టూరు పరిసర గ్రామాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొని లడ్డూ ప్రసాదం స్వీకరించాలని వేంకటేశ్వర స్వామి భక్త సమాజం కోరింది.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు: గుంటూరు–2 డిపో నుంచి సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే పుష్కరాలకు 24న బస్సు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. యాత్ర మొత్తం మూడు రోజులు ఉంటుందన్నారు. 24వ తేదీ రాత్రి 10 గంటలకు బస్సు బయల్దేరి, రెండో రోజు కాళేశ్వరం చేరుతుందని తెలిపారు. అక్కడ పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన తరువాత రామప్ప దేవాలయం, వరంగల్ భద్రకాళీ దేవాలయం, వెయ్యి స్తంభాల గుడి సందర్శన ఉంటుందని తెలియజేశారు. మూడో రోజున కొండగట్టు శ్రీఆంజనేయస్వామి, వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరి స్వామిని దర్శించుకుని గుంటూరు తిరుగు ప్రయాణం అవుతుందని వివరించారు. ఈ సర్వీసుకు ఆన్‌లైన్‌లో 96163 నంబరు ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక టికెట్‌కు రూ.2,420 ధర నిర్ణయించినట్లు తెలిపారు. వసతి, భోజన ఖర్చులు ఎవరివి వారే చూసుకోవాలని, వివరాలకు 7382897459, 7382896403 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

- జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ
- జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర'



జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ, పోలీసు అధికారులు

బాపట్ల: భావితరాల ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లు, కార్యాలయాలలో 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని చెత్త, వ్యర్థాలను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. గునపాలు, పారలు, చీపురులు చేతబట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల 3వ శనివారం నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత మాత్రమే కాదని, అది మన అభివృద్ధికి పునాదని, శుభ్రమైన పరిసరాలు మన ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. పోలీస్ స్టేషన్, కార్యాలయాల పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు.

పక్షుల కోసం నీటి పాత్రలు ఏర్పాటు చేయాలి

పరిశుభ్రమైన పర్యావరణం మానసిక ప్రశాంతతను పెంచుతుందన్నారు. ఇది పోలీస్ సిబ్బంది పనితీరుపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రస్తుతం వేసవి కాలం కనుక సహజమైన చల్లదనం కోసం టెరస్ లపై ఆకర్షణీయమైన, ఆరోగ్యకరమైన మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పక్షుల దాహార్తి తీర్చేందుకు గోడలు, టెరస్ లపై చిన్న మట్టి పాత్రలలో నీటిని ఏర్పాటు చేయాలన్నారు. భూమిపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాలు పడేందుకు చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మనం ఇప్పుడు నాటే మొక్కలు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇస్తాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా భావించి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఎఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్బి ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఆర్ఐ మౌలుద్దీన్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి కె.వి.కృష్ణారెడ్డి



రేపల్లె: సచివాలయ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం వేధింపులను ఆపాలని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి కె.వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి పౌర సేవలను ప్రజల ముంగిటికే చేర్చారన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా విధుల్లోకి తీసుకోకుండా వారి ఉపాధిపై దెబ్బకొట్టిందన్నారు. ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పలు రకాల సర్వేల పేరుతో పని ఒత్తిడి కల్పించి మానసికంగా వేధిస్తుందని చెప్పారు.

చెరువును చెరబట్టారు

చుండూరు మండలం పెదగాదెలవర్రు చెరువులో కూటమి నేతల అక్రమ మట్టి తవ్వకాలు



పెదగాదెలవర్రు చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న కూటమి నాయకులు

చుండూరు(వేమూరు): అధికారంలోకి వచ్చింది దరిమిలా కూటమి నేతలు మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలతో పేట్రేగుతున్నారు. చెరువులకు చెరువులనే చెరపడుతూ మట్టిని అక్రమంగా తోడేస్తూ, లక్షలు ఆర్జిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చుండూరు మండలంలోని పెదగాదెవర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువులో మట్టిని కూటమి నేతలు అక్రమ తవ్వేస్తూ, ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.800కి అమ్మేస్తూ జేబులు నింపుకొంటున్నారు. పట్టపగలు మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీరు–చెట్టు పథకం కింద చెరువులను తవ్వేసిన టీడీపీ నేతలు అక్రమంగా రూ.లక్షలు ఆర్జించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో నేతల కన్ను చెరువులపై పడింది. అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి లక్షలు ఆర్జించాలనే ధ్యేయంతో ముందుకెళుతున్నారు. ఇంతజరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

జగనన్న కాలనీల్లో మెరక కోసమే..

జగనన్న కాలనీల్లో మెరకలు వేసేందుకు చెరువు తవ్వకానికి అనుమతి ఇవ్వడం జరిగింది. మండలంలోని పెదగాదెలవర్రు, చుండూరు, అంబేడ్కర్ నగర్, నడిగడ్డవారి పాలెం, చిన గాదెవలవర్రు, చినపరిమి, కారుమూరు పాలెం గ్రామాల్లో జగనన్న కాలనీలకు మట్టి తరలిస్తున్నాం.

– నాగరాజు, చుండూరు తహసీల్దార్

వైఎస్ జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం



ఆలూరి సాంబశివారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న పార్టీ న్యూజిలాండ్ కన్వీనర్ బుజ్జిబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో సుపరిపాలన వైఎస్. జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎన్నారై విభాగం గ్లోబల్ కో–ఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో శనివారం న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ న్యూజిలాండ్ కన్వీనర్ నెల్లూరి బుజ్జిబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సాంబశివారెడ్డి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలనతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్ర పథాన ముందుకు దూసుకెళ్లిందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఆయన సుపరిపాలన అందించారని కొనియాడారు. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలే కాకుండా ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ఎన్నారై విభాగం వైఎస్ జగన్ నాయకత్వానికి ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని తెలిపారు. బుజ్జిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వైఎస్ జగన్ పరిపాలన చరిత్రలో మరపురాని ముద్ర వేసిందని పేర్కొన్నారు. 17 మెడికల్ కళాశాలలు, పోర్టులు, విద్య, వైద్యంతో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్‌లో జరిగిన సమావేశానికి ఆన్‌లైన్‌లో గుంటూరుకు చెందిన జి. శాంతమూర్తి హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ న్యూజిలాండ్ ఎన్నారై కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి చెస్ జట్ల ఎంపిక

మాచర్ల రూరల్: పల్నాడు చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అండర్–11 చెస్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జరగనున్నాయి. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఈ పోటీలు ఉంటాయని పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కే కిరణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల్గొనే వారు రూ.300 చెల్లించాలని పేర్కొన్నారు. 2014 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. బాలుర, బాలికల విభాగాల్లో ఇద్దరు చొప్పున ఎంపిక చేస్తామన్నారు. ఈ నలుగురు క్రీడాకారులు అండర్ –11 పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 93900 59759 ఫోను నంబరులో సంప్రదించాలని కోరారు.

పర్చూరు బస్టాండ్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

పర్చూరు(చినగంజాం): పర్చూరు బస్టాండు వద్ద వర్షపు నీటిలో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వర్షపు నీటిలో ఉన్న మృత దేహాన్ని బయటకు తీశారు. అక్కడ పడి ఉన్న విధానంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పంచనామా నిర్వహించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు వైద్యశాలకు తరలించారు.

కారు బోల్తా : వ్యక్తికి గాయాలు




చినగంజాం: మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్ గాయాలపాలైన సంఘటన చినగంజాం – ఉప్పుగుండూరుల మధ్య జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. దర్శి గ్రామానికి చెందిన వెదురు చెన్నారెడ్డి శనివారం చీరాల నుంచి ఒంగోలు వైపు కారు డ్రైవింగ్ చేస్తూ వెళుతున్నాడు. చినగంజాం టోల్ ప్లాజా దాటిన తరువాత సాయిబాబ విగ్రహం వద్ద కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. డ్రైవర్ చెన్నారెడ్డికి స్వల్ప గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకుడిపై దాడి.. కేసు నమోదు

చీరాల: సముద్రతీరంలో సేదతీరేందుకు వచ్చిన వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపరచిన సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం చీరాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వేటపాలెం మండలం సంపత్‌నగర్‌కు చెందిన యనుముల వీరాస్వామి అతని కుటుంబంతో శుక్రవారం రామాపురం సముద్రతీరానికి వెళ్లారు. అదే సమయంలో వారి పక్కన సముద్రస్నానం చేస్తున్న కొందరు యువకులు గోల చేస్తూ ఇబ్బందిగా ప్రవర్తించడంతో వీరాస్వామి వారించాడు. ఆవేశానికి గురైన యువకులు అతనిపై దాడి చేయగా అడ్డుకోబోయిన అతని కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



నకరికల్లు: ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొలిమి బడే సాహెబ్ (69) పొలానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. గ్రామశివారులో ఇటుక బట్టీల వద్ద రోడ్డు దాటుతుండగా చిలుకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఆతనికి తీవ్రగాయాలు కాగా, నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

ఘనంగా జానపద కళాపీఠం రజతోత్సవం



డప్పులు వాయిస్తున్న జానపద కళాకారులు



కళాకారుడిని సన్మానిస్తున్న కళాపీఠం సభ్యులు

అద్దంకి రూరల్: జానపద కళాపీఠం రజతోత్సవం శనివారం రాత్రి స్థానిక బంగ్లారోడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు దేవపాలన మాట్లాడుతూ పల్లె ప్రజల గుండె చప్పుడు జాన పదమన్నారు. జానపద కళలు ఎప్పటికీ చెరిగిపోని జ్ఞాపకాలని తెలిపారు. దీనిలో భాగంగా చెన్నుపల్లి నాగేశ్వరరావు బృందం చేపట్టిన కోలాట ప్రదర్శన, జానపద రూపాలైన డప్పువాయిద్య కళాకారులు ప్రదర్శన, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జ్యోతి శ్రీరాములు స్మారక సాహిత్య పురస్కారాన్ని కొండా శ్రీనివాసులు, వీరవల్లి రంగయ్య, యశోదమ్మ స్మారక కళాపురస్కారాన్ని కారుమూరి సీతారామయ్యకు, గుర్రం జాషువా స్మారక సాహితీ పురస్కారాన్ని పిన్నాబత్తిన వెంకట రమణయ్యకు, మారెడ్డి స్మారక కళాపురస్కారాన్ని బత్తుల ఆంజనేయులుకు, జానపద కళాపీఠం ఆత్మీయ సన్మానాన్ని ప్రముఖ రంగస్థల కళాకారుడు ఆర్జేటి సుబ్బారావుకు అందజేశారు. వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) జ్యోతి చంద్రమౌళి, గాడేపల్లి దివాకరదత్తు, జ్యోతి శ్రీమన్నారాయణ, మలాది శ్రీనివాసరావు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, తాళ్లూరి సుబ్బారావు, గోగుల వీరాంజనేయులు విస్తాలి శంకరావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన పవర్ లిఫ్టర్ల వివరాలు వెల్లడిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి: మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరిగే పవర్ లిఫ్టింగ్ నేషనల్ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ మెన్, ఉమెన్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ టీమ్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో శనివారం వివరాలను వెల్లడించారు. ఉమెన్ సబ్ జూనియర్ టీమ్ 76 కేజీల విభాగంలో బి. లాలిత్య, 84 కేజీల విభాగంలో ఈ.ఎల్. వినయశ్రీ, జూనియర్ టీమ్ 47 కేజీల విభాగంలో ఎం. షానూన్, 76 కేజీల విభాగంలో ఎల్. చాతుర్య, 84 కేజీల విభాగంలో ఎన్. జ్ఞాన దివ్యలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పురుషుల సబ్ జూనియర్ 53 కేజీల విభాగంలో టి. శివకార్తిక్, 83 కేజీల విభాగంలో ఎస్. మునీశ్వర్ రామ్, జూనియర్ 93 కేజీల విభాగంలో ఎస్. కౌశిక్, 105 కేజీల విభాగంలో డి. పృథ్వీకుమార్‌ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన పవర్ లిఫ్టర్లను రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు.

సోషల్ మీడియా, సైబర్ నేరాల పర్యవేక్షణ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: సోషల్ మీడియా, సైబర్ నేరాలను నియంత్రించేందుకు కేంద్రం నెలకొల్పినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఉమేష్ చంద్ర బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిపుణులైన పోలీస్ సిబ్బంది ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల కార్యకలాపాలు, సామాజిక మాధ్యమాల ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘవిద్రోహ శక్తులను గుర్తిస్తారన్నారు. తద్వారా వారి చర్యలను అణచివేసేందుకు ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందిస్తారని చెప్పారు. సామాజిక మాధ్యమాల వాడకం, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారని ఆయన తెలిపారు. కేంద్రం ఏర్పాటుకు సహకరించిన జిల్లెళ్లమూడి వెంకట్, కొల్లా అశోక్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు జి.వి.రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), సీఐలు అలహరి శ్రీనివాస్ (ఎస్‌బీ), నిస్సార్ బాషా, ఎస్సీ సీసీ ఆదిశేషు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

నవతరానికి పుస్తక పఠనం అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్



కవితా ప్రవంతి ఆవిష్కరణలో పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ

నగరంపాలెం: నవతరానికి పుస్తక పఠనం అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ ఐదో వీధిలోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీసు ఆర్గనైజేషన్ ప్రాంగణంలో శనివారం ఏపీ అభ్యుదయ రచయితల సంఘం 90 ఏళ్ల సంబరాల్లో భాగంగా కవితా ప్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. సభకు సాహితీవేత్త భూసురుపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను నవతరం చదవడం అవసరమని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ సమితి అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఛాయారాజ్, ఎండ్లూరి సుధాకర్, నూతలపాటి గంగాధరం, పఠాభీల కవిత్వాన్ని ఈ తరం సులభంగా చదువుకునేలా అందిస్తున్న అరసం కృషి మరువలేనిదని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకాలు కవి ఆత్మీయతను ప్రతిబింబించేలా ఉన్నాయని తెలిపారు. అనంతరం యుద్ధం– శాంతి అంశంపై కవితా గోష్ఠి నిర్వహించారు. బండికల్లు జమదగ్ని, మేడిశెట్టి సుభద్ర, హేమలత, ఎం.లలితకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో జనసాహితి దివికుమార్, రచయిత్రి మందరపు హైమావతి, అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ పాల్గొన్నారు.